శవాలు చెప్పిన కథలు!

అజీజ్

అదే ఆవడి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ!

ఫ్యాక్టరీ మెయిన్ గేట్ ముందు జీప్ ఆపేడు ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి. గేటుదగ్గర డి. ఎస్. సి. (డిఫెన్స్ సెక్యూరిటీ కోర్) తాలూకు జవాన్లూ, ఆఫీసర్లూ ఉన్నారు.

రాజారెడ్డి ఆఫీసర్లకి తన ఐడెంటిఫికేషన్స్, మూవ్‌మెంట్ ఆర్డర్స్ తీసి చూపేడు.

అతన్ని అక్కడే వెయిటింగ్‌లో వుండమని చెప్పి, ఓ ఆఫీసర్ లోనికెళ్ళి ఐదునిమిషాల్లో తిరిగి వచ్చేడు.

"రండి కాన్ఫరెన్స్ రూంలో జనరల్ మీకోసం ఎదురుచూస్తున్నారు" అన్నాడు. అతన్ని అనుసరిస్తూ కాన్ఫరెన్స్ రూంవైపు నడిచేడు రాజారెడ్డి.

"వెల్‌కమ్ మిస్టర్ రాజారెడ్డీ! ఇప్పుడే ఒ.జి.పి. మీరు వస్తున్నట్టు ఫోన్ జేసి చెప్పేరు." అన్నాడు లెఫ్టినెంట్ జనరల్ కైలాశ్ సైగల్ అతన్ని సాదరంగా అహ్వానిస్తూ.

జనరల్ సైగల్‌తోబాటు ఫ్యాక్టరీ డైరెక్టర్ బ్రిగేడియర్ ధీరజ్ పాండే కూడా అక్కడే వున్నాడు.

రాజారెడ్డి ఇద్దరికీ విష్ జేసి, ఓ కుర్చీలో కూర్చున్నాడు.

"ఫ్యాక్టరీలోపలా, బైటా సాంకేతికంగానూ, వ్యక్తిపరంగానూ ఎన్నో కట్టుదిట్టాలున్నాయి. ఇక్కడ పనిలోకి తీసుకునే అతి సామాన్య ఉద్యోగి విషయంలోకూడా మూడు నాలుగుసార్లు పోలీస్ వెరిఫికేషన్ జరుపబడుతుంది. అప్పుడుగానీ వాళ్ళని ఉద్యోగంలోకి తీసుకోరు" అన్నాడు జనరల్.

"ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో సీక్రెట్స్ లీక్ అవుతున్నాయని అసలు ఎలా బైటపడింది?" సిగరెట్ అంటించి అడిగేడు రాజారెడ్డి.

జనరల్ డెస్క్‌లోంచి ఓ ఫైల్ తీసి బల్లమీద పెట్టి, "చూడండి!" అన్నాడు.

రాజారెడ్డి ఫైల్ అందుకుని చూసేడు.

కొన్ని కాగితాలూ, ఓ కేబినెట్ సైజు ఫోటో ఉన్నాయందులో. ఫోటోలో ఓ ఆటోమేటిక్ గన్ పూర్తి నమూనా, దాని తాలూకు వివిధ భాగాలూ స్పష్టంగా చిత్రించబడున్నాయి.

వాటిని పరీక్షగా చూసి_ "ఫ్యాక్టరీనుంచి లీక్ అయిన నమూనాలు ఇవేనా?" అడిగేడు రాజారెడ్డి.

జనరల్ తలూపేడు.

"ఇవి మళ్ళీ మీ దగ్గరికెలా వచ్చాయి?"

"ఇరవై వేల నగదు చెల్లించి, మా రహస్యాలని మేమే కొనుక్కోవలసి వచ్చింది!"

ఆశ్చర్యంతో రాజారెడ్డి కళ్ళు విప్పారేయి. "ఎలా కొన్నారు? ఎవరిదగ్గర కొన్నారు?"

జనరల్ నవ్వి- "మన గూఢచారి విభాగం, మిలిటరీ సీక్రెట్ సర్వీస్ తమ రెగ్యులర్ ఏజెంట్సుతోబాటు కొందరు డూప్లికేట్ ఏజెంట్సుని కూడా పోషిస్తారని మీకు తెలుసుకదా?

ఆ డూప్లికేట్‌లు ఇటు మననుంచే కాదు, అటు శత్రు దేశపు గూఢచారి విభాగంతోనూ చేతులు కలిపి, వారి నుండీ జీతం పుచ్చుకుంటూరు. ఈ సంగతి తెలిసి కూడా మనం తెలియనట్టు ఊరుకుంటాం! కారణం, ఒక్కోసారి మనం వాళ్ళ ద్వారానే శత్రుదేశానికి తప్పుడు సమాచారాలు అందించి శత్రుదేశాన్ని పల్టీ కొట్టించడానికి అవకాశాలు లభిస్తాయి. అటువంటి డూప్లికేట్ ద్వారానే మాకివి తిరిగి లభించేయి" అన్నాడు.

"ఫ్యాక్టరీలోని ఈ రహస్యాలు అతనికెలా అందేయి? ఎవ్వరందించేరు? అతన్ని అరెస్ట్‌జేసి విచారణ జరపలేదా మీరు?"

"నో,నో. అరెస్ట్‌జేసి, ఎన్ని హింసలు పెట్టినా చెప్పేవాడు కాదేమో! ఆ రాస్కెల్స్ అటువంటి మొండి తర్ఫీదు పొందివుంటారు. ప్రాణం పోయినా సరే, అసలు సంగతి బైటపెట్టరు.

అందుకే ఇవి కొన్నట్టు కొని, వాడికేమాత్రం అనుమానం రాకుండా గట్టినిఘా ఏర్పాటుజేశాం. ఆ విధంగా అసలు ద్రోహిని పట్టుకోవాలని ఆశించాం. కాని, మా ప్లాను

పూర్తిగా పల్టీ కొట్టింది. వాడి మీద నిఘా ఏర్పాటు జేసిన మూడవరోజు రాత్రి ఎవ్వరో వాణ్ణి కాల్చి చంపేరు."

"ఫ్యాక్టరీ సిబ్బందిలో మీకెవ్వరి మీదైనా అనుమానం వుందా?"

"ఉంది. కేవలం అనుమానం! దానికి నిర్దుష్టమైన ఆధారాలేవీ మాకు లభ్యం కాలేదు. ఆ డూప్లికేట్ మరణం తరవాత, మిలిటరీ ఇంటలిజెన్స్ శాఖవారు ఫ్యాక్టరీలో, అనుమానితులకోసం గాలింపు ప్రారంభించేరు.

మూడు నెలలు శ్రమించేక, ఫ్యాక్టరీ సిబ్బందిలో అతి కీలకస్థానాల్లో పనిజేస్తున్న ఇద్దరు ఇంజనీర్ల పేర్లు బైటికి వచ్చాయి. మీరు వాళ్ళ నివేదిక ఒకసారి పరిశీలించండి" అంటూ బ్రిగేడియర్ వైపు తిరిగి—"ఆ ఫైల్స్ తీసుకు రండి" అన్నాడు జనరల్.

బ్రిగేడియర్ ధీరజ్ పాండే లేచి వెళ్ళి కొన్ని ఫైల్స్ తీసుకువచ్చాడు.

రాజారెడ్డి ఓ ఫైల్ అందుకుని చూడసాగేడు.

అందులో ఓ వ్యక్తి పాస్‌పోర్ట్ సైజు ఫోటో అతికించి వుంది. ఉంగరాల జుత్తు. కోటేరు ముక్కు. పల్చని పెదాలు. నిండైన బుగ్గలు. పెదాలమీద సన్నని మీస కట్టు. విజ్ఞానం తొణికిసలాడే చురుకైన కళ్ళు.

ఫోటో కిందే అతని పేరూ, ఒడ్డూ పొడుగూ, వ్యక్తిగత వివరాలు రాసివున్నాయి.

పేరు—ఆత్మప్రకాశ్. వయసు—35. క్వాలిఫికేషన్—మిలిటరీ ఇంజనీరింగ్ కోర్స్, ఫస్ట్‌క్లాస్ డిగ్రీ. రెండు యుద్ధాల్లో పాల్గొన్నాడు. ప్రస్తుతం ఫ్యాక్టరీలో గన్స్

మోల్డింగ్ సెక్షన్‌లో డిజైనింగ్ ఆఫీసర్‌గా పని జేస్తున్నాడు.

వివాహితుడు. ఇంకా సంతానం లేదు. భార్య విలాస జీవితానికి బాగా అలవాటుపడిన వ్యక్తి. ఎడ్రస్-డిఫెన్స్ కాలొనీ, బిల్డింగ్ నెంబర్ 3-36. ఫ్లాట్ నెంబర్-47.

ఆ ఫైల్ మూసి రెండో ఫైల్ అందుకున్నాడు రాజా రెడ్డి.

అందులోనూ ఓ వ్యక్తి ఫోటో, దానికింద అతని వివరాలూ రాసివున్నాయి.

పేరు—నిరంజన్ దాస్. వయసు—37. క్వాలిఫికేషన్స్—కెమిస్ట్రీతో ఎమ్.ఎస్.సి. మూడు సంవత్సరాల మిలటరీ ట్రైనింగ్, ఫ్యాక్టరీలో మోలిక్యూలర్ లేబొరేటరీ ఇంచార్జ్, రెండు యుద్ధాలు అటెండ్ జేసేడు.

అవివాహితుడు. కాని, అందమైన ఆడవాళ్ళ నగ్న చిత్రాలు పోగుజేసి దాచుకునే పిచ్చివుంది. పేకాటన్నా, రేసులన్నా పడిచస్తాడు.

"మిస్టర్ రాజారెడ్డీ! నా దగ్గిర ఒక పథకం వుంది. దాన్ని అమలుపరచి చూస్తే ఏమైనా ఫలితం వుంటుందేమోనని నా దృఢ నమ్మకం!" అన్నాడు జనరల్, ఇన్‌స్పెక్టర్ ఫైలు మూసేక.

రాజారెడ్డి తలూపి—"చెప్పండి" అన్నాడు.

"ఫ్యాక్టరీ దక్షిణదిశలో, చివర్న కొన్ని బేరక్స్ (సైనికులు నివసించే కట్టడాలు) ఖాళీగావున్నాయి. స్పెషల్ ట్రైనింగ్ నెపంతో ఇరవైమంది ఆఫీసర్లని అక్కడ సమీకరించాలి. ఆ గ్రూప్‌లో ఆత్మప్రకాశ్, నిరంజన్‌దాస్‌లతోబాటు మీరూ వుంటారు. జబల్‌పూర్

నించి ఆ ట్రేనింగ్ కోసం పిలిపించబడ్డ కేప్టెన్‌గా మిమ్మల్ని వాళ్ళకు పరిచయం జేస్తాను. ఆవిధంగా వారితో మీరు స్నేహం జేసుకుని, ఆ ప్రమిత్రుడిగా సంచరిస్తూ వారి కదలికలు క్షుణ్ణంగా పరిశీలిస్తూ, వారితో చేతులు కలపడానికి సిద్ధంగా వున్నట్టు నటించాలి. ఆ విధంగా ఆ ద్రోహుల నిజస్వరూపం బైటపడుతుంది. ఏమంటారు?''

రాజారెడ్డి తలూపి, ''పథకం బాగుంది. నాదొక మనవి. ఈ కేసులో నాకు మరొకరి తోడు అవసరం కలగవచ్చు. నాకు సహాయకుడిగా నా అసిస్టెంట్ డేవిడ్‌ని తీసుకోవాలనుకుంటున్నాను,'' అన్నాడు.

జనరల్ కాసేపు ఆలోచించి_''ఆల్ రైట్! ఆఏర్పాటు కూడా జరుగుతుంది. మీ అసిస్టెంట్‌ని లెఫ్టినెంట్‌గా ఆ క్యాంప్‌కు రప్పించాలి. మీరిద్దరూ స్నేహితులని యితర కేడెట్స్‌కి అనుమానం రానివ్వకుండా జాగ్రత్తపడుతూ, మీమీ కార్యకలాపాలు సాగించాలి'' అన్నాడు.

2

జనరల్ కైలాశ్ సైగల్ వేసిన స్కీమ్ అమలులోకి వచ్చింది. ఆత్మప్రకాశ్, నిరంజన్‌దాస్‌లతోబాటు, సైన్యంలోని వివిధ ర్యాంకుల ఆఫీసర్లు స్పెషల్ ట్రేనింగ్ మిషతో అక్కడికి రప్పించబడ్డారు.

వారిలో ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డీ, సార్జంట్ డేవిడ్ కూడా వున్నారు. బేరెక్స్ చేరువలోనే కుక్‌హౌస్, డైనింగ్ హాల్ వున్నాయి. వాటి వెనుక వైపు రిక్రియేషన్ భవనం వుంది. అందులో ప్లేయింగ్ కార్డ్స్, కేరమ్స్, చెస్, రేడియో, టెలివిజన్, లైబ్రరీ, బార్ మొదలైన ఎంటర్‌టైన్‌మెంట్ సౌకర్యాలన్నీ అమర్చబడ్డాయి.

రాత్రి భోజనాలయ్యేక అందరూ అక్కడ సమావేశ మయ్యేరు. జనరల్ సైగల్ వాళ్ళని ఉద్దేశించి ప్రసంగించ వలసి వుంది. కేడెట్స్ అందరూ నిశ్శబ్దంగా కుర్చీల్లో కూర్చునివున్నారు. బ్రిగేడియర్ ధీరజ్ పాండే, జనరల్ సైగల్ చిన్న వేదికమీద ఆసీనులైవున్నారు.

జనరల్ లేచి, అందర్నీ ఒకసారి పరికించి, చెప్ప సాగేడు.

"డియర్ ఫ్రెండ్స్!

ఈ ట్రేనింగ్ పీరియడ్‌లో నేను మీమీద ఎక్కువ ఆంక్షలు పెట్టదలచుకోలేదు. అలా అని మిలిటరీ డిసిప్లిన్‌కి విరుద్ధంగా ఎవ్వరూ ఎలాటి అవాంఛనీయమైన పని జెయ్య డానికి వీల్లేదు.

నేను వెల్‌ఫేర్‌తోబాటు, డిసిప్లిన్ మీదకూడా ఎక్కువ శ్రద్ధ చూపిస్తాడు. వాటిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్య తీసుకోబడుతుంది. రాత్రివేళ మీ రిక్రియేషన్ కోసం యిక్కడ అన్ని ఏర్పాట్లూ చెయ్యబడ్డాయి.

రాత్రి పన్నెండు గంటలవరకు మీరక్కడ కులాసాగా గడపొచ్చు. ఇక్కడి కార్యభారమంతా బ్రిగేడియర్ ధీరజ్ పాండేగారికి అప్పగించబడింది. ఈ రోజునుంచి వీరే మీ ట్రూప్ కంమాండింగ్ ఆఫీసర్. వారి పర్యవేక్ష ణలో మీరు మీ కోర్స్ విజయవంతంగా పూర్తి జెయ్య గలరని ఆశిస్తున్నాను" అంటూ ముగించేడు జనరల్.

మరుక్షణం కేడెట్స్ కరతాళ ధ్వనులతో హాలంతా మారుమోగింది.

జనరల్, బ్రిగేడియర్ ఇద్దరూ వేదిక దిగి బైటికెళ్ళి పోయేరు.

కేడెట్స్ అంతా బార్ కౌంటర్ దగ్గర గుమిగూడ సాగేరు.

రాజారెడ్డి రిస్టువాచీ చూసుకున్నాడు. తొమ్మిదిం బావు!

సార్జంట్ డేవిడ్ కూడా అక్కడే ఉన్నాడు మిలిటరీ యూనిఫాంలో. అతని షోల్డర్స్ మీద లెఫ్టినెంట్ హోదా క్రాస్స్ మెరుస్తున్నాయి.

బార్ కౌంటర్లో విస్కీ తీసుకుని ఓ రౌండ్ టేబిల్ ముందు కూర్చున్నాడు ఆత్మప్రకాశ్. నిరంజన్ దాస్ అప్పటికే ఓ పెగ్ లాగించి ప్లేయింగ్ కార్డ్స్ ఆదే టేబిల్ వైపు పోతున్నాడు.

డేవిడ్ పక్కగా నడుస్తూ తగ్గుస్వరంలో ఏదో చెప్పి, నిరంజన్ దాస్ ఉన్నవైపు నడిచేడు రాజారెడ్డి.

"ఎవరైనా రమ్మీ ఆడతారా?" అంటున్నాడతను రౌండ్ టేబిల్ ముందు నిల్చుని.

రాజారెడ్డి నవ్వి, "రండి. కూర్చుందాం!" అన్నాడు.

"గుడ్ కెప్టెన్! నా పేరు నిరంజన్ దాస్!" అన్నాడతను చెయ్యి ముందుకి చాస్తూ.

"అయామ్ రాజారెడ్డి! రేడియోలజిస్ట్ని. గ్లాడ్ టు మీట్ యూ." అంటూ షేక్ హాండ్ ఇచ్చేడు రాజారెడ్డి స్నేహపూర్వకంగా.

ఇంతలో మరో ఇద్దరు వచ్చేరక్కడికి.

నలుగురూ నాలుగు కుర్చీల్లో తిష్ఠ వేసేరు.

"పాయింట్ కి రూపాయి చొప్పున ప్రారంభిద్దామా?" అడిగేడు నిరంజన్.

"నో, నో. ఫిఫ్టీ పైసా చాలు!" అన్నాడు రాజారెడ్డి.

మిగతా ఇద్దరూ అతనికి సపోర్ట్ ఇచ్చేరు.

నిరంజన్‌దాస్ కార్డ్స్ కలిపి ముక్కలు పంచసాగేడు. వాళ్ళతో రమ్మీ ఆడుతున్నా, ఇన్‌స్పెక్టర్ ధ్యాస మాత్రం ఫేస్ ఆడేవారి టేబిల్ దగ్గర నిల్చుని చూస్తున్న ఆత్మప్రకాశ్ మీదే ఉంది.

ఆట జోరుగా సాగుతోంది. నిరంజన్‌దాస్ పేకాటలో బాగా చెయ్యితిరిగినవాడిలా వున్నాడు. గంటలోపలే ఇన్‌స్పెక్టర్ నలభై రూపాయలు ఓడిపోయేడు. మిగతా ముగ్గురూ వంతులవారీగా గెలుస్తున్నారు. ఇంకా అలా ఆడుతూపోతే ఉన్నదంతా ఊడ్చిపెట్టేలా ఉన్నారు.

అప్పుడే ఇన్‌స్పెక్టర్ దృష్టి హాల్లోంచి బైటికెళ్తున్న ఆత్మప్రకాశ్ మీద పడింది. డబ్బు అయిపోయిందనే నెపంతో వెళ్ళి పడుకుంటానని చెప్పి ఆవులిస్తూ లేచాడు.

బార్ కౌంటర్ దగ్గరికెళ్ళి ఓ పెగ్ విస్కీ తీసుకుని, గ్లాసు అలాగే చేతిలో పట్టుకుని వాకింగ్ స్టెప్స్ వేస్తూ తలుపువైపు నడిచేడు ఇన్‌స్పెక్టర్. బైట పిండారబోసినట్టు వెన్నెల కాస్తోంది. అక్కడక్కడా ఎదిగిన ఎత్తైన పొదలు. కొబ్బరి చెట్లు.

హాల్లో ఆడుకుంటున్న వాళ్ళ మాటలు తప్ప అక్కడ నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. ఆ చెట్ల మధ్యనించి, పాంటు జేబుల్లో చేతులు పెట్టుకుని, సన్నగా ఈల వేసుకుంటూ నడుస్తున్నాడు ఆత్మప్రకాశ్. ఇన్‌స్పెక్టర్ బుర్ర చురుగ్గా పనిచెయ్యసాగింది.

ఒంటరిగా ఎందుకు వచ్చేడు బైటికి? వెన్నెల్లో షికారుకా? లేక మరేదైనా కారణం ఉందా?

ఆత్మప్రకాశ్ అటూ ఇటూ చూడ్డం లేదు. ఏదో ఇంగ్లీష్

రాగాన్ని ఈలవేసుకుంటూ నడుస్తున్నాడు. ఇన్‌స్పెక్టర్ చేతిలో విస్కీ గ్లాసు ఇంకా అలాగే ఉంది.

సవ్వడికాని అడుగులతో అతనిని వెంబడించసాగేడు. రిక్రియేషన్ రూంలో ఉన్నవారి మాటలు ఇప్పుడు చాలా సన్నగా వినిపిస్తున్నాయి. ఇద్దరూ ఏభై గజాలు నడిచి ఉంటారు.

ఇంతలో హఠాత్తుగా నిశ్శబ్దాన్ని చీలుస్తూ, "డిష్" మనే శబ్దం వినిపించడం, ముందు వెళుతున్న ఆత్మప్రకాశ్ చిన్నగా వెనక్కి ఉన్నపళంగా నేలకూలడం లిప్తపాటులో జరిగిపోయేయి.

దిగ్భ్రాంతితో ఇన్‌స్పెక్టర్ కాళ్ళకి బ్రేకులుపడ్డాయి. కిందపడ్డ ఆత్మప్రకాశ్‌లో చలనం లేదు.

ఏమిటా శబ్దం? ఎక్కణ్ణించి వచ్చింది? చుట్టుపక్కల పొదలు, చెట్లు. ఏ వైపునుండి వచ్చిందో అంచనా వెయ్యడం సాధ్యంకాదు. అప్పుడు జ్ఞాపకం వచ్చింది ఇన్‌స్పెక్టర్‌కి. అటువంటి శబ్దం సైలెన్సర్ బిగించిన పిస్తోలు పేలినప్పుడే వస్తుందని. ఎవ్వరో పొదలమాటున నక్కి ఆత్మప్రకాశ్‌ని కాల్చేరు. ఎవ్వరు?

తను కదలకూడదు. కదిలితే ఆ వ్యక్తికి తన ఉనికి తెలిసిపోతుంది. ఆత్మప్రకాశ్‌కి పట్టిన గతే తనకీ పడుతుంది. ఇన్‌స్పెక్టర్ ఊపిరి బిగపట్టి రాతిబొమ్మలా అలాగే నిల్చున్నాడు.

పదిహేను నిమిషాలు గడిచేయి.

అదే నిశ్శబ్దం! చుట్టుపక్కల ఎలాంటి అలికిడీ లేదు. హంతకుడు తనలాగే కిక్కురుమనకుండా కాచుకున్నాడా? తన ఓపికని పరీక్షిస్తున్నాడా? ఈ సందేహాలు తీర్చుకో

వాలి. ఇన్‌స్పెక్టర్ మరేమీ ఆలోచించకుండా చేతిలో ఉన్న గ్లాస్‌ని పొదలవైపు విసిరేడు.

మరుక్షణం "డిష్"మన్న శబ్దం.

క్షణం తరవాత పొదల్లోపడి పరిగెత్తుతున్న అడుగుల చప్పుడు. తనూ పరిగెత్తాడు. కాని లాభం లేకపోయింది. క్షణక్షణానికీ ఆ శబ్దం దూరమౌతూ వినిపించసాగింది.

ఐదు నిమిషాల తర్వాత ఇన్‌స్పెక్టర్ వెనుకకు తిరిగి వచ్చి ఆత్మప్రకాశ్ పడివున్నవైపు వెళ్ళేడు. బోర్లా పడున్న అతన్ని వెల్లికిలా తిప్పేడు.

సరిగ్గా అతని నుదుటిమీద రంధ్రం! దాంట్లోంచి ఉబికి పెదాలవరకూ కారిన ఎర్రని రక్తం! కళ్ళు రెండూ తెరిచి ఉన్నాయి. దీన్నిబట్టి హంతకుడు గురితప్పకుండా కాల్చడంలో మంచి ప్రావీణ్యం కలవాడని తెలుస్తోంది.

శత్రుపక్షంవారికీ, ఆత్మప్రకాశ్‌కీ సంబంధం ఉన్నట్టు ఈ సంఘటనతో తేలిపోయింది. తాము ఆత్మప్రకాశ్‌ని అనుమానిస్తున్నట్టు వాళ్ళు పసిగట్టి ఉంటారు. అతని ద్వారా తమ రహస్యం ఎక్కడ బైటపడుతుందో అని కాల్చిపారేసేరు.

రాజారెడ్డి బుర్రలో తళుక్కున మెరిసింది మెరుపు. ఆత్మప్రకాశ్ భార్యకూ్కడా తన భర్త రహస్యం తెలిసి ఉంటుందా? అతని ఇల్లు సోదాచేస్తే విద్రోహుల ఆచూకీ తెలిపే కాగితాలేవైనా దొరకవచ్చు. క్షణం వృధాచేస్తే ఆ అవకాశం కూడా చెయ్యిజారిపోతుందేమో? ఇన్‌స్పెక్టర్ మరేమీ ఆలోచించకుండా రిక్రియేషన్ హాల్లోకి వెళ్ళేడు. డేవిడ్ కనిపిస్తే ఆత్మప్రకాశ్ హత్యగురించి బ్రిగేడియర్‌కు తెలీశేసి, అక్కడి తతంగం చూసుకోమని చెప్పి వెళ్ళాలని, హాలంతా కలయజూసేడు.

డేవిడ్ లేడు!

అంతేకాదు, అంతక్రితం అక్కడ పేకాడుతూ కూర్చున్న నిరంజన్‌దాస్ కూడా లేడు!! ఇద్దరూ ఏమయ్యేరు? ఎక్కడికెళ్ళేరు?

3

ఆత్మప్రకాశ్ వుండే ఆరంతస్థుల సౌధం ముందు జీప్ ఆపి, రిస్టువాచీ చూసుకున్నాడు రాజారెడ్డి. పదిన్నర!

ఈ చివర్నించి ఆ చివరివరకూ వీధి నిర్జనంగా వుంది. ఎక్కడో చెత్తకుండీలో పడుకుని పెద్దగా ఏడుస్తోంది ఊరకుక్క.

ఆత్మప్రకాశ్ వుండేఫ్లాట్ నెంబర్ మననం జేసుకుంటూ జీప్ దిగి భవనంవైపు నడిచేడు. అందులో అనేక కుటుంబాలు నివసిస్తూవుంటాయి. పైఅంతస్తుల్లో అక్కడక్కడా ఇంకా లైట్లు వెలుగుతున్నాయి. పరిగెత్తుతున్నట్టు మెట్లెక్కుతూ ఏడు నిమిషాల్లో నాలుగో అంతస్తు జేరుకున్నాడు.

ఫ్లాట్ నెంబర్స్ చెక్ జేసుకుంటూ చివరికి ఆత్మప్రకాశ్ వాళ్ళ ఫ్లాట్ ముందు ఆగేడు. తలుపు మూసివుంది. లోపల లైటు వెలుగుతున్నట్టు తలుపు సందులోంచి కాంతి కనికనిపిస్తోంది.

గుమ్మానికున్న కాలింగ్ బటన్ నొక్కేడు. లోన బెల్ మోగుతున్న శబ్దం. రెండు నిమిషాల తరవాత లోపలినించి గడియ తీసినట్టు చిన్నచప్పుడు. కాని, తలుపు తెరుచుకోలేదు.

"ఎవ్వరు?" లోపలినించి పలికింది స్త్రీ కంఠం.

ఆ కంఠంలో తాగిన మత్తుకూడా మిళితమైవున్నట్టు

గమనించేడు ఇన్‌స్పెక్టర్. "ఆత్మప్రకాశ్ గారు మీకివ్వమని ఓ పేకెట్ యిచ్చిపంపేరు!" అన్నాడు పాచిక విసురుతూ,

"అలాగా! ఆ పాకెట్ కింద గుమ్మం దగ్గరపెట్టి వెళ్ళు. నే తీసుకుంటాను." అంది ఆమె జోగుతున్నట్టు.

ఊహించని ఆజవాబుతో నివ్వెరబోయేడు ఇన్‌స్పెక్టర్.

ఏనవాళ్ళు ఎవ్వరిచేతైనా ఏదైనా పంపితే స్వయంగా వచ్చి తీసుకోడమేగాక, తెచ్చినందుకు థాంక్స్ చెప్పడం రివాజు. అదేమీ లేకుండా గుమ్మం దగ్గర పెట్టి వెళ్ళమంటోందేమిటి? ఇంట్లో ఎవ్వరైనా వున్నారా? తను చూస్తానని భయమా? ఏదో అయుంటుంది. తెలుసుకోవాలి.

గడియ ఎలాగూ తీసివుంది. ఒక్కతోపుతోసేడు తలుపుని. రెక్కలు భళ్ళుమంటూ తెరుచుకోవడం, ఆమె చిన్న కేకపెడుతూ గదిలో పడిపోడం రెప్పపాటులో జరిగిపోయేయి. ఒక్క ఉదుటున లోనికిదూరి, కాలితో తలుపు మూసేడు.

"ఎవరు నువ్వు? ఏమిటీ దౌర్జన్యం?" అంటూ నేలమీంచి లేవబోయిందామె.

రాజారెడ్డి మెరుపులా జేబులోంచి పిస్తోలు తీసి—

"లేవక! లేస్తే నిర్దాక్షిణ్యంగా చంపేస్తాను" అన్నాడు.

ఆమె లేచే ప్రయత్నం విరమించుకుని, మోచెయ్యి నేలమీద ఆనించి అలాగే పడుకుంది. అప్పుడు చూసేడు ఆమెనీ, ఆమె అవతారాన్నీ ఆమె చేతిలోవున్న వస్తువునీ!

దాదాపు ఇరవైఎనిమిదేళ్ళుంటాయి. నున్నని గులాబి

రంగు ఒళ్ళు. భుజాలవరకూ కత్తిరించుకున్న జుత్తు. లోపలి ఒంపులన్నీ కనిపించే పల్చని స్లీపింగ్ గౌను. చేతిలో విస్కీ గ్లాసు.

ఇన్‌స్పెక్టర్ ఎక్స్‌రేకళ్ళు చకచక గదిని పరిశీలించేయి. గదినిండా పాశ్చాత్య పద్ధతిలో అమర్చిన ఖరీదైన సామాను. ఎదురుగా గోడకి నేలవరకూ వేలాడుతున్న పెద్దముఖమల్ కర్టెన్. ఆ గది పక్కనే మరోగది వుంది. ఇంట్లో ఇంకెవ్వరైనా ఉండివుంటే ఆ గదిలోనైనా వుండాలి. లేదా, ఎదురుగా గోడకి వేలాడుతున్న పరదా వెనకైనా నక్కివుండాలి.

అతని మౌనాన్ని సాకుగా తీసుకుని అంది ఆమె. "కనీసం నన్ను లేచి కూర్చోనివ్వు. నిన్నూ, నీ పిస్తోలూ చూసి నేనేం భయపడ్డంలేదు."

ఇన్‌స్పెక్టర్ నవ్వి—"నీ నిర్భయానికి కారణం. ఇంట్లో నీకు తోడుగా ఇంకెవ్వరో వున్నారు. నీకాపద రాకుండా కాపాడతారు. ఆ వ్యక్తి పక్కగదిలో పొంచివుండాలి సమయంకోసం. లేదా ఆ కర్టెన్ వెనక నక్కివుండాలి..."

ఇన్‌స్పెక్టర్ వాక్యం ఇంకా పూర్తికాకముందే కర్టెన్ మధ్య పిస్తోలు ఆకారం మొనదేలింది.

"ఢిష్, ఢిష్, ఢిష్!" ఒకటి కాదు మూడుసార్లు పేలింది పిస్తోలు కర్టెన్ వెనకనించి.

4

డేవిడ్ ఒంటరిగా టేబుల్ ముందు కూర్చుని, పేకాడుతున్న నిరంజన్‌దాస్‌నే గమనిస్తున్నాడు ఓరగా.

అప్పటికే ఆత్మప్రకాశ్‌ని వెంబడిస్తూ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి వెళ్ళి పావుగంటయింది. ఆత్మప్రకాశ్ బైటి

కెళ్ళినప్పుడే అనుమానం వేసింది డేవిడ్‌కి. అతని వెనకే నిరంజన్‌దాస్ కూడా వెళ్ళేవాడేమోనని. కాని, అతను లేవడంలేదు.

పూర్తయిన సిగరెట్ ఏష్‌ట్రేలో ఒత్తి గ్లాస్ అందుకున్నాడు డేవిడ్. సరిగ్గా అదే క్షణంలో నిరంజన్‌దాస్ పేకాట ఆపి కుర్చీలోంచి లేచాడు. మిగతావారితో ఏదో అని, తలుపువేపు నడిచేడు.

గ్లాసులో మిగిలిన విస్కీ ఒక్క గుక్కలో ఖాళీచేసి, బల్లమీద పెట్టి లేచాడు డేవిడ్. అప్పటికే నిరంజన్‌దాస్ తలుపు దాటేడు. డేవిడ్ అడుగులో అడుగు వేసుకుంటూ తనూ అటు నడిచేడు. ఆత్మప్రకాశ్, రాజారెడ్డి ఎటు వెళ్ళేరో తనకు తెలీదు.

ఏది ఏమైనా నిరంజన్‌దాస్, ముందు నిర్ణయించిన ప్రోగ్రాం ప్రకారం ఎక్కడికో వెళుతున్నాడని డేవిడ్ అనుమానం. నిజానికి నిరంజన్‌దాస్ వెళుతున్నది ఆత్మప్రకాశ్, రాజారెడ్డి వెళ్ళినవైపు కాదు. మరో దిశలో!

డేవిడ్ అతన్ని కొద్దిదూరం పోనిచ్చి, వెనక నిశ్శబ్దంగా వెంబడించసాగేడు. నిరంజన్‌దాస్ నడుస్తూ నడుస్తూ ఒకటి రెండుసార్లు రిస్టువాచీ చూసుకున్నాడు. కాసేపటికి ఇద్దరూ పొదలూ—చెట్లూ వున్న ప్రదేశాన్ని సమీపించేరు. ముందు వెళుతున్న నిరంజన్‌దాస్ చటుక్కున ఆగి అటూఇటూ చూడసాగేడు.

డేవిడ్ మెరుపులా కుడిపక్క వున్న పొదవెనక నక్కి చూడసాగేడు. సరిగ్గా అదే క్షణంలో కోకాకోలా కార్క్ ఊడదీసినట్టు "ఫిస్,ఫిస్!" మని వినిపించేయి శబ్దాలు.

అంతే! నిరంజన్‌దాస్ నేలమీంచి గజం ఎత్తు ఎగిరి

కాండం విరిగిన చెట్టులా నేలకూలేడు. డేవిడ్ గుండెలో గుర్రాలు దౌడుదీసేయి. సైలెన్సర్ బిగించిన పిస్తోలు పేలి నప్పుడే అటువంటి చప్పుడౌతుంది.

పిస్తోలు పేలిన తరవాత చడీ చప్పుడూ లేదు! హంతకుడు యింకా అక్కడే పొంచి ఉండివుంటాడు. డేవిడ్ నేలమీద పడుకుని నిశ్శబ్దంగా అవైపు పాకసాగేడు. కొద్ది దూరం వెళ్ళాడో లేదో, దురదృష్టవశాత్తు ఓ ఎండు పుల్ల అతని కిందికి వచ్చి విరిగి చిన్న శబ్దమైంది.

మరుక్షణం పిస్తోలు పేలడం, గుండు పొదల ఆకులు చీల్చుకుంటూ దూసుకుపోవడం జరిగిపోయేయి. డేవిడ్ ఊపిరి బిగబట్టి అలాగే పడుకున్నాడు. హంతకుడు నిస్సందేహంగా తనకి చేరువలోనే వున్నాడు. వెన్నెల కాస్తోంది. నిజమే. కాని, ఆ పొదల మధ్య హంతకుడు ఎక్కడున్నాడో అంచనా వెయ్యడం కష్టం!

తను వెనక్కి వెళ్ళిపోదామన్నా అవకాశంలేదు. ఈ చాటునించి తను ఏమాత్రం బైటికి వచ్చినా హంతకుడి పిస్తోలుకు టార్గెట్ సులువుగా దొరుకుతుంది.

డేవిడ్ బుర్రలో ఓ వుపాయం మెరిసింది. మోకాళ్ళ మీద కూర్చుని జేబులోంచి రివాల్వర్ తీసి ఎడంచేతిలో రెడీగా పట్టుకున్నాడు. కుడిచేత్తో కాలిబూటు లాగి దూరంగా పొదలమధ్య విసిరేడు. సర సర చప్పుడయింది.

"ఢిష్!"మంది పిస్తోలు.

డేవిడ్ ఉపాయం ఫలించింది. హంతకుడి పిస్తోలునించి వెలువడ్డ మెరుపు పొదల్లో అతనెక్కడ నక్కిఉన్నాడో స్పష్టంగా ఇండికేట్ జేసింది. డేవిడ్ ఇంకేమీ ఆలోచించకుండా రివాల్వర్ అటు గురిపెట్టి కాల్చేడు. ఆ

భయంకర నిశ్శబ్దాన్ని చీలుస్తూ పొదల్లోంచి చావుకేక వినిపించింది.

ఐనా, చెవులు రిక్కించి కూర్చున్నాడు డేవిడ్. అది పొంతపడి ఎత్తుకూడా కావచ్చు. తనకి గుండు తగిలినట్లు గావుకేక పెడితే, కాల్చిన వ్యక్తి తను చచ్చేనని పరిగెత్తుకు వస్తాడు. ఆ తర్వాత......

పావుగంట వరకూ అలాగే కూర్చుని కాచుకున్నాడు డేవిడ్. అవతలినుంచి ఎటువంటి రెస్పాన్స్ రాకపోవడంతో నేలమీద పడుకునే కేక వినిపించినవైపు పాకసాగేడు.

పదిగజాలు వెళ్ళగానే కనిపించింది ఆకారం!

ఓ చెట్టుబోదెకు వీపు ఆనించి కూర్చున్న మానవాకారం!

డేవిడ్ అక్కడే ఆగిపోయేడు. ఆ ఆకారంలో కదలిక లేదు. తొందరపడితే ప్రమాదం. జాగ్రత్తకోసం రెండవ కాలికున్న బూటు తీసి ఆకారంమీదికి విసిరేడు. ఐనా ఎటువంటి చలనం కలగలేదు.

అప్పుడు కొద్దిగా ధైర్యం వచ్చింది డేవిడ్ కి. అతను చచ్చివుంటాడు. లేదా, మూర్ఛపోయి ఉంటాడు. లేచి, అడుగులో అడుగు వేసుకుంటూ అతన్ని సమీపించేడు. ఆనందంలో డేవిడ్ గుండె ఉరకలు వేసింది.

తన గురి తప్పలేదు. అతని ఛాతీమీద పెద్ద రంధ్రం జేస్తూ దూసుకుపోయింది గుండు. అతను చచ్చేడు. డేవిడ్ గబగబ శవం జేబులు వెదికి చూసేడు. సిగరెట్ పాకెట్ లైటర్, ఓ మడత కత్తి, కొంత డబ్బూ తప్ప మరేమీ లేవు.

అతన్ని అక్కడే వదిలి, నిరంజన్‌దాస్ పడున్న చోటికి పరిగెత్తేడు. అతని శరీరంలో రెండు రంధ్రాలు కనిపించేయి. ఒకటి కంఠం దగ్గిర. రెండోది ఛాతీమీద. అందుకే గుళ్ళు తగిలేక అతని నోటినుంచి చిన్న శబ్దం కూడా బైటికి రాలేదు.

డేవిడ్ చక చక అతని జేబులు వెదికేడు. పాంటుపై జేబులో కర్చీఫ్, తాళంచెవుల గుత్తి తప్ప మరేం లేవు. లోపలి జేబులో అతని ఐడింటిఫికేషన్ కార్డ్, మనీపర్స్ ఉన్నాయి.

పర్స్ తెరిచి చూసేడు. కొన్ని నోట్లూ చిల్లరా ఉన్నాయి. అరలో ఓ మూల మడతబెట్టిన చిన్న కాగితం కనిపించింది. వేళ్ళతో దాన్ని బైటికి లాగి విప్పేడు.

"రాత్రి సరిగ్గా పదిన్నరకి... తూర్పు దిశగా—
చెట్లూ, పొదలూ ప్రారంభమయ్యే చోట! 'ఎ'"
అని రాసి ఉంది.

సాలోచనగా తలూపేడు డేవిడ్. దాంట్లో రాసివున్న ప్రదేశమే ఇది. ఆ కాగితాన్ని జేబులో కుక్కుతూ, గబ గబ రిక్రియేషన్ హాల్‌వైపు నడిచేడు. హాల్లో ఒకరిద్దరు ఇంకా ఏవో ఆడుకుంటున్నారు.

రాజారెడ్డిగానీ, అశ్వప్రకాశ్‌గానీ ఎక్కడా కనిపించ లేదు.

5

కర్టెన్ వెనక పిస్తోలు మొన కనిపించగానే అది ఇంకా పేలకముందే రాజారెడ్డి మెరుపులా నేలమీద పడి పోయేడు.

పిస్తోలు పేలడం, అంతకుముందు అతను నిలుచున్న

తలుపు మధ్య మూడు రంధ్రాలు ఏర్పడటం కన్ను మూసి తెరిచేలోగా జరిగేయి.

కింద పడుతూనే రివాల్వర్ అటు గురిపెట్టి ట్రిగ్గర్ వత్తేడు రాజారెడ్డి.

"ధాం!" గది మారుమోగింది.

కర్టెన్ వెనకనుంచి ఓ భారీ శరీరం కర్టెన్‌తోబాటు నేలకూలింది. బహుశా కింద పడుతున్నప్పుడే అతని ప్రాణాలు ఎగిరిపోయుంటాయి. అతని చేతిలో సైలెన్సర్ బిగించిన పిస్తోలు ఉంది. అందుకే పిస్తోలు గొట్టం మరో బెత్తెడు పొడుగయింది. ఆ కారణంవల్లే కర్టెన్ వెనక పిస్తోలు ఆకారం కనిపించింది.

నేలమీంచి లేచి శవాన్ని సమీపించేడు. అతని దుస్తులు గాలించేడు. స్పేర్ బుల్లెట్స్, దువ్వెన, సిగరెట్ కేస్, డ్రైవింగ్ లైసెన్స్, మనీపర్స్ కనిపించేయి.

పర్స్ తెరచి చూసేడు. వందరూపాయల నోట్ల దొంతర. అన్నీ కొత్తనోట్లు! లెక్కపెట్టేడు. నాలుగువేల తొమ్మిదివందల చిల్లర. డ్రైవింగ్ లైసెన్స్ అందుకుని పరిశీలించేడు. అందులో అతని ఫోటో, పేరూ వున్నాయి. పేరు చదివేడు. అబ్దుల్ రజాక్!

పర్స్ జేబులో వేసుకుని లేచేడు. ఆమె వేనిటీ బ్యాగ్ కూడా అక్కడే, టీపాయ్‌మీదుంది. దాన్ని అందుకుని చూసేడు. అందులోనూ వంద వందరూపాయల నోట్ల దొంతర. మొత్తం ఐదువేలు!

జేబులోంచి అబ్దుల్ రజాక్ పర్స్ తీసి, అందులోని నోట్ల నెంబర్లూ ఆమె బ్యాగ్‌లోని నోట్ల నెంబర్లూ చెక్ జేసేడు. అన్నీ ఒకే సీరీస్‌వి!

దీన్నిబట్టి స్పష్టమౌతోంది. అబ్దుల్ రజాక్ అనబడే ఈ వ్యక్తి ద్వారానే ఆత్మప్రకాశ్ కి ప్రతిఫలం ముడుతోందన్న మాట.

వేనిటీ బ్యాగ్ పెట్టి, పిస్తోలు ఊపుతూ ఆమెవైపు తిరిగేడు. "లే!"

"ఎవరు నువ్వు? ఏమిటీ దౌర్జన్యం?" అంది లేచి నిల్చుంటూ.

రాజారెడ్డి నవ్వి-"సి. బి. ఐ. ఏజెంటుని!" అన్నాడు నింపాదిగా.

ఏ దొంగో అయ్యుంటాడనుకున్న ఆమె మొహం వివర్ణ మైంది.

"భోగవిలాసాలు మరిగి, శత్రుదేశంతో చేతులు కలిపి, మాతృదేశానికి ద్రోహం చేస్తూ జల్సాగా జీవించాలనుకున్న మీ బండారం బద్దలైంది. నేనడిగే ప్రశ్నలకి సూటిగా జవాబి స్తేసరి. లేదా, ఆడదానివని కనికరించను.

ఎంత మొండి ప్రాణం నోటినించైనా, కావలసింది వెళ్ళగక్కించడం నా ప్రత్యేకత. పిచ్చివేషాలు వేసికూడా ప్రయోజనం ఉండదు. రాబోయే ప్రమాదాన్ని మెరుపు కన్నా వేగంగా ఎలా ఎదుర్కొంటానో ఈపాటికి గ్రహించి వుంటావ్. ముందు నీ ముద్దు పేరేమిటో చెప్పు!"

అతని మాటలు ఆమెమీద పూర్తి ప్రభావం వేసేయి.

"పల్లవి!" అంది వణుకుతూ.

"ఈ అబ్దుల్ రజాక్ ద్వారానే కదూ మీకు డబ్బు ముట్టేది?"

పల్లవి పలకలేదు.

"మర్యాదగా అడిగితే చెప్పాలని ముందే హెచ్చరిం

చేను.'' అన్నాడు ఇన్‌స్పెక్టర్ అడుగు ముందుకు వేస్తూ.

ఐనా ఆమె పెదవి విప్పలేదు.

''పల్లవీ! ఇక ఏం దాచినా నిష్ప్రయోజనం. కొన్ని గంటల క్రితం క్యాంపులో నీ భర్త నా కళ్ళముందే హత్య జెయ్యబడ్డాడు.''

''అబద్ధం!'' అంది పల్లవి దాదాపు అరుస్తూ.

ఇన్‌స్పెక్టర్ నవ్వి- ''శవాన్ని కళ్ళారా చూసేవరకు నమ్మవన్నమాట. సరే, కొద్దిసేపట్లో అదీ జరుగుతుంది. ప్రభుత్వం నీ భర్తని అనుమానిస్తున్నట్టు అతని బాస్‌కి ఎలాగో తెలిసిపోయింది. అందుకే, అతను తమ రహస్యాలు వెల్లడి జెయ్యకుండా అతన్ని శాశ్వతంగా ఈ లోకంనించి పంపేసేరు.

నీ భర్త పతనానికీ, చావుకీ కారణమైన చీడపురుగుల గురించి నీకేమాత్రం తెలిసినా వెంటనే చెప్పెయ్. పోయిన నీ భర్త ఎలాగూ తిరిగిరాడు. కనీసం మాతో సహకరించి, అతను మాతృభూమికి జేసిన పాపాల్ని ప్రక్షాళనం గావించు,'' అన్నాడు.

ఆమె మొహంలో ఇంకా అనుమానపు ఛాయలు పోలేదు. కాసేపు తీవ్రంగా యోచించి తలెత్తింది. ''మీరేదో ఎత్తు వేస్తున్నారని నా అనుమానం! ఆయన హత్య జెయ్యబడ్డాడని అబద్ధం చెప్పి, నా నోరు విప్పడానికి ప్రయత్నిస్తున్నారు.''

ఇన్‌స్పెక్టర్ భుజాలెగురవేసి- ''ఆల్‌రైట్ నీ భర్త శవాన్ని చూద్దువుగాని, పద! ముందీ శవాన్ని స్థానిక పోలీసులకప్పగించాలి.'' అంటూ పక్కనే వున్న టెలిఫోన్ వైపు నడిచేడు.

కాసేపు ఫోన్లో మాట్లాడి, రిసీవర్ దించి_ "కమాన్ మూవ్!" అన్నాడు తలుపువైపు చూపిస్తూ.

ఇద్దరూ ఇంట్లోంచి బైటపడి, గబగబ మెట్లు దిగి కిందికి చేరుకున్నారు. రోడ్డు ప్రక్క తన జీప్ ఉంది. అప్పటికే చంద్రుడు అస్తమించేడు బైట చీకటిగా వుంది.

ఇద్దరూ జీప్ ఎక్కేరు. రాజారెడ్డి ఇంజన్ స్టార్ట్ చేద్దామని వంగి, ఇగ్నిషియన్ కీ మీద చెయ్యి వేసేడు. అంతే!

చీకట్లో_ "ఢిస్!"మన్న శబ్దం వినిపించింది.

ఇన్స్పెక్టర్ పక్కన కూర్చున్న పల్లవి గావుకేక పెడుతూ ఒరిగిపోయింది. తక్షణం తన శరీరాన్ని ముద్దలా ముడుచుకున్నాడు ఇన్స్పెక్టర్.

మళ్ళీ రెండుసార్లు_ "ఢిస్, ఢిస్!"మన్న శబ్దం.

రాజారెడ్డి తిన్నగా సీట్లో కూర్చుని ఉంటే, ఆ రెండు గుళ్ళూ అతని శరీరంలో తిష్టవేసేవి. ఒళ్ళు ముడుచుకోడం వల్ల గుళ్ళు రెండూ అతని వీపుమీంచి దూసుకుపోయేయి.

మరుక్షణం చీకట్లో పడి ఎవ్వరో పారిపోతున్న అడుగుల చప్పుడు వినిపించింది. లిప్తపాటులో ఆ చప్పుడు దూరమవసాగింది.

పల్లవి ఇంకా చావలేదు. గుండు తగలవలసిన చోట తగల్లేదు కాబోలు. గట్టిగా ఊపిరి తీసుకుంటూ వదలుతోంది.

ఇన్స్పెక్టర్ గుండెలో ఆశ పొంగి పొర్లింది.

ఆమెని రెండు చేతుల్లో పొదివి పట్టుకుని_ "పల్లవీ! పల్లవీ!" అన్నాడు ఆత్రంగా.

పల్లవి పలకలేదు.

అప్పుడు గమనించేడు ఇన్స్పెక్టర్. ఆమె మెడ కుడివైపు ఏర్పడ్డ గాయాన్ని. గాయంలోంచి ఇంకా రక్తం

కారుతోంది. వెచ్చని చిక్కని రక్తం!

"పల్లవీ! పల్లవీ! కళ్ళు తెరువ్!" అన్నాడు కుదుపుతూ. పల్లవి మెల్లగా కళ్ళు తెరిచి, అతన్ని రెప్ప వెయ్యకుండా చూడసాగింది.

"పల్లవీ! ఎవ్వరో నిన్నూ, అబ్దుల్ రజాక్ నూ చంపాలనే ఇక్కడ పొంచివున్నాడు. ఆ హంతకుడెవ్వరో కాస్త ఆలోచించి చెప్పగలవా?"

పల్లవి జవాబివ్వలేదు. తెరిచిన కళ్ళు మూసుకుంది. ఉఛ్వాస నిశ్వాసాలతో ఆమె ఛాతీ ఎగిరిపడుతోంది. కాసేపటికి మెల్లిగా కళ్ళు తెరిచింది.

"హోటల్...హోటల్ గోల్డ్ స్టార్...అ..."అంతే, ఆమె తల ప్రక్కకి వాలిపోయింది.

ఇన్ స్పెక్టర్ నవనాడులూ కృంగిపోయేయి.

సరిగ్గా అదే సమయంలో ఓ జీపు దూసుకువచ్చి వాళ్ళ పక్కన ఆగింది. అది పోలీస్ జీప్. పల్లవి ఇంట్లోంచి రాజారెడ్డి ఫోన్ చేసి పిలిపించిన స్థానిక పోలీసులు వాళ్ళు.

నలుగురు కానిస్టేబుళ్ళూ, ఓ సబిన్ స్పెక్టర్ జీప్ లోంచి బిల బిల దిగేరు. శవాన్ని కానిస్టేబుళ్ళ కప్పగించి, ఇన్ స్పెక్టర్ని వెంటబెట్టుకుని మెట్లెక్కి పల్లవి ఇంట్లో ప్రవేశించేడు రాజారెడ్డి.

అక్కడ పడున్న అబ్దుల్ రజాక్ శవాన్ని సబిన్ స్పెక్టర్ కప్పజెప్పి, కావలసిన ఇన్ స్ట్రక్షన్స్ ఇచ్చి, గబ గబ ఫోన్ వైపు నడిచేడు. క్యాంపులో ఉన్న బ్రిగేడియర్ ధీరజ్ పాండే రెసిడెన్స్ కి రింగ్ జేసి రిసీవర్ అందుకున్నాడు.

"ఎస్! బ్రిగేడియర్ స్పీకింగ్." అవతలినుంచి వినిపించింది,

"నేను రాజారెడ్డి మాట్లాడుతున్నాను సార్!"

"మిస్టర్ రెడ్డీ! మీరెక్కడికెళ్ళారు? ఇంతవరకూ మీ కోసం క్యాంపులో వెతికించి విసిగిపోయేను. ఆత్మప్రకాశ్, నిరంజన్‌దాస్ ఇద్దరూ హత్య చెయ్యబడ్డారు!"

"వాట్!?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యంగా.

ఆత్మప్రకాశ్ హత్య తాను కళ్ళారా చూసేడు. కాని, అంతలోనే నిరంజన్‌దాస్ కూడా చంపబడటం అతనికి వింతగా తోచింది.

"నిరంజన్‌దాస్ హత్య మీ అసిస్టెంట్ డేవిడ్ కళ్ళ ముందే జరిగిందిట. అంతేకాదు, డేవిడ్ తన చాక చక్యంతో నిరంజన్‌ను చంపిన హంతకుణ్ని కాల్చి పారే సేడు. మూడు శవాలూ ఇంకా ఇక్కడే ఉన్నాయి. డేవిడ్ ద్వారా ఆ సంఘటన తెలియగానే, జనరల్ సైగల్‌గారికి ఫోన్ జేసి చెప్పేను. ఆయన కొద్దిక్షణాల్లో ఇక్కడికి రాబోతున్నారు. మీరు వెంటనే బయలు దేరండి." అన్నాడు బ్రిగేడియర్ అవతలినుంచి.

రాజారెడ్డి అంతవరకు జరిగిందంతా అతనికి వివరించి, "పల్లవి మరణిస్తూ హోటల్ గోల్డ్‌స్టార్ పేరు ఉచ్ఛరించింది. ఒక్క నిమిషం ఆమె ప్రాణాలు నిలిచి వుంటే, బహుశా ఇంకేమైనా చెప్పేదేమో! దురదృష్టం. ఐనా, చివరి శ్వాస విడుస్తూ ఆ హోటల్ పేరు చెప్పిందంటే, తప్పకుండా అక్కడేదో క్లూ దొరకవచ్చు. అందుకే నేను తక్షణం అక్కడికెళ్ళి కనుక్కోవాలనుకుంటున్నాను.

శత్రువు తనతో సంబంధం ఉన్నవాళ్ళందర్నీ వంతుల వారీగా మట్టుబెడుతున్నాడు. తన రహస్యం బయటపడ కుండా జాగ్రత్తపడుతున్నాడు. ఏది ఏమైనా హోటల్

గోల్డ్ స్టార్‌లో ఏదో మిస్టరీ ఉంది. అది తెలుసుకోవాలి. ఆ పని నా ఒక్కడివల్ల జరక్కపోవచ్చు. దయచేసి నా అసిస్టెంట్ డేవిడ్‌ని తక్షణం ఆ హోటల్‌కి బైలుదేరి అక్కడ నాకోసం ఎదురుచూడమనండి.'' ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి అన్నాడు.

''ఆల్‌రైట్! ఇప్పుడే పంపిస్తాను'' అవతల క్లిక్‌మంది.

రాజారెడ్డి ఫోన్ పెట్టేసి ఇల్లంతా నిశితంగా గాలించసాగాడు.

6

హోటల్లో అడుగుపెట్టి హాల్లో కూర్చున్న వాళ్ళను ఓ మారు పరీక్షగా చూసేడు రాజారెడ్డి. నగరంలో బాగా పేరున్న హోటల్ అది. రాత్రింబవళ్ళూ నడుస్తుంది. హాల్లో అక్కడక్కడా కూర్చుని తింటూ తాగుతున్నారు కస్టమర్స్.

ఓ మూల ఒంటరిగా కూర్చుని విస్కీ తాబోలు చప్పరిస్తున్నాడు ఓ వ్యక్తి. నల్లని గెడ్డం, మీసాలు. కళ్ళకి గోల్డ్ ఫ్రేం పాయింటెడ్ జోళ్ళు.

డేవిడ్ వున్నాడేమోనని హాలంతా కలయజూసేడు. ఈపాటికి డేవిడ్ వచ్చి తనకోసం ఎదురుచూడవలసింది. ఇంకా రాలేదు. వచ్చేక అతనితో సంప్రదించి పథకం వెయ్యాలి. అంతవరకూ తొందరపడకూడదు.

ఆలోచిస్తూ వెళ్ళి ఓ టేబుల్ ముందు కూర్చున్నాడు ఇన్‌స్పెక్టర్. ఊరికే కూర్చుంటే ఇతర్ల దృష్టిలో పడవచ్చు. బేరర్‌తో ఓ పెగ్ విస్కీ తెప్పించుకుని చప్పరించసాగేడు.

ఇంతలో బైటనించి ఓ వ్యక్తి హోటల్లో ప్రవేశించేడు.

సన్నగా పొడుగ్గా ఉన్నాడు. బ్లాక్ సూటు. కాళ్ళకి బూట్సు.

తలుపుదగ్గరే ఆగి ఓమారు అందర్నీ పరీక్షగా చూసి, బార్ కౌంటర్ వైపు నడిచేడు. ఏదో లిక్కర్ తీసుకుని, కాసేపు అక్కడే కూర్చుని తాగి, గ్లాసు చేతిలో పట్టుకుని పచార్లు జేస్తున్నట్టు రాజారెడ్డి కూర్చున్నవైపు వచ్చేడు.

అతన్ని దాటి ముందుకు పోబోతూ ఆగి_"ఎక్స్క్యూజ్ మీ! ఈ రోజు ఒకటవ తేదీ కదూ?" అడిగేడు తగ్గు స్వరంలో.

ఇన్స్పెక్టర్ తల విదిలించి_ "నో! మూడో తేదీ!" అన్నాడు.

"థాంక్యూ!" అంటూ అతను వడి వడిగా బాత్ రూం వైపు వెళ్లేడు.

అప్పుడు రివిజన్ అయింది రాజారెడ్డిలో అతను అడిగిన ప్రశ్న! ఎవ్వరైనా తేదీగాని, టైమ్‌గాని అడగాలనుకుంటే_ 'ఈ రోజు తేదీ ఎంత?' అంటారు.

కాని, అతను_ 'ఈ రోజు ఒకటవ తేదీ కదూ?' అన్నాడు. అతనికి తేదీ తెలీనప్పుడు అలా అడగడంలో అర్థంలేదు. బాగా ఆలోచించేక అందులోని అర్థం ఏమిటో రాజారెడ్డికి బోధపడింది. సి. బి. ఐ. ఏజెంట్లు పరస్పరం గుర్తించుకోడానికి 'ఒకటి' అనే పదాన్ని వాడతారు.

ఐతే, ఆ వ్యక్తి సి. బి. ఐ. ఏజంటా? తనకేదైనా ముఖ్య విషయం చెప్పడానికి వచ్చేడా? దేనికైనా మంచిది. ఓసారి కనుక్కుంటే నష్టం ఏమిటి? అనుకుంటూ తనూ లేచి అతను వెళ్ళిన బాత్ రూంవైపు నడిచేడు.

బాత్ రూం తలుపు దగ్గరగా వేసివుంది. రాజారెడ్డి

సందేహించకుండా లోన అడుగుపెట్టేడు. ఆ వ్యక్తి ఒంగుని వాష్ బేసిన్‌లో చేతులు కడుక్కుంటున్నాడు.

"ఈ లోకంలో సవాలక్ష వెధవలు జీవిస్తున్నారు. వాళ్ళతో వేగలేక చావాలి!" అన్నాడు రాజారెడ్డి తనలో తను గొణుక్కుంటున్నట్టు. 'ఒకటి' అనే పదానికి తిరుగు జవాబు 'సవాలక్ష' ఆ వ్యక్తి నిజంగా సి.బి.ఐ. ఏజెంటైతే ఆ వాక్యంలోని జవాబును గ్రహించి తనతో మాట్లాడతాడు. ఇన్‌స్పెక్టర్ అనుమానం నిజమే అయింది.

అతను మెల్లిగా వెనక్కి తిరిగి_ "నిజం చెప్పేరు!" అన్నాడు నవ్వుతూ.

ఇన్‌స్పెక్టర్ గుండె గతుక్కుమంది.

ఆ వ్యక్తి చేతిలో నల్లగా నిగనిగ మెరుస్తోంది. పిస్తోలు. అది సైలెన్సర్ బిగించిన పిస్తోలు!!

పళ్ళు పటపట కొరికేడు ఇన్‌స్పెక్టర్. అతను ఏజెంటు కాడు. శత్రుపక్షం మనిషి. వాళ్ళకి ఎలాగో సి.బి.ఐ. కోడ్ సిగ్నల్ తెలిసిపోయింది. హోల్లో అంతమంది మధ్య తనని చంపడం రిస్కు గనక, మోసంతో ఇక్కడికి రప్పించుకున్నాడు.

తన జేబులోనూ ఉంది పిస్తోలు. ఆ వ్యక్తి దాన్ని తీసే వ్యవధి ఇవ్వడు. చిరుతలా అతనిమీదికి లంఘించాలన్నా అవకాశంలేదు. అతను కేవలం గజన్నర దూరంలో వున్నాడు.

అతని వ్రేలు ట్రిగ్గర్ని వత్తబోతోంది. ఇహ ఒక్క క్షణంలో తన జీవితం సమాప్తం! నిస్సహాయంగా కళ్ళు మూసుకున్నాడు రాజారెడ్డి.

"ఢాం!" చెవులు పిక్కటిల్లేయి.

చావుకేక!

సైలెన్సర్ బిగించిన పిస్తోల్లోంచి అటువంటి శబ్దంరాదు; ఆశ్చర్యంతో కళ్ళు తెరిచేడు ఇన్‌స్పెక్టర్. ఎదురుగా వున్న వ్యక్తి గుండె పట్టుకుని నేల కూలుతున్నాడు.

నివ్వెరబోతూ వెనుదిరిగి చూసేడు.

తలుపు మధ్య అంతక్రితం హాల్లో కనిపించిన, గడ్డం వ్యక్తి నిల్చునున్నాడు. అతని చేతిలో పొగ విడుస్తున్న పిస్తోలు వుంది.

రాజారెడ్డి అటు చూడగానే, అతను చిన్నగా నవ్వుతూ పెట్టుకున్న గడ్డాన్ని తీసేడు.

"నువ్వా!?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యంగా.

డేవిడ్ తలూపి_ "మీరు రాకముందే నేనీ వేషంలో ఇక్కడికి వచ్చి మీకోసం కాచుకున్నాను. తరువాత మీరు రావడం, ఇతను మీతో ఏదో మాట్లాడ్డం, మీ రిద్దరూ ఒకరి వెనుక ఒకరు బాత్‌రూంలోకి దూరడంతో సంగతేమిటో చూద్దామని ఇటు వచ్చేను. మీరు కోరినట్టు బ్రిగేడియర్, నన్ని హోటల్లో మిమ్మల్ని కలుసుకోమని చెప్పేసరికి జాగ్రత్తకోసం ఈ వేషం వేసుకోక తప్పింది కాదు. కారణం, కొన్ని గంటల క్రితం నా కళ్ళముందే నిరంజన్‌దాస్ చంపబడ్డాడు..." అన్నాడు.

"ఇటువంటి సూక్ష్మబుద్ధి, మెళకువ ఉండబట్టే ప్రతి కేసులోనూ నిన్ను నాకు తోడుగా ఎన్నుకుంటున్నాను డేవిడ్! ఈ రోజుతో నీకెంతో ఋణగ్రస్థుడినయ్యేను" అంటూ కింద పడున్న ఆ వ్యక్తిని బూటుకాలితో వెల్లికిలా తిప్పేడు రాజారెడ్డి.

గుండు తగిలిన మరుక్షణం ప్రాణం పోయివుంటుంది.

అతని జేబుల్లో సామాన్యమైన వస్తువులు తప్ప మరేమీ లేవు.

"ఇది ఆరవ శవం! శత్రువు వేసిన పథకానికి ఈ ఒక్క రాత్రే ఆరుగురు బలయ్యేరు." అన్నాడు రాజారెడ్డి పెదవి విరుస్తూ.

"స్కోరు పెద్దదే! కాని, రిజల్ట్ మాత్రం జీరో!" అన్నాడు డేవిస్. ఇన్‌స్పెక్టర్ బుర్రలో తళుక్కుమంది ఓ ఆలోచన. "డేవిడ్! స్థానిక పోలీసుల్ని పిలిపించి ఈ శవం సంగతి చూసుకో. నేను కాస్త బ్రిగేడియర్‌తో మాట్లాడి వస్తాను." అంటూ గబగబ బైటికి నడిచేడు.

కౌంటర్లో ఉన్న ఫోన్ ద్వారా బ్రిగేడియర్ రెసిడెన్స్‌కి రింగ్ జేసి రిసీవర్ అందుకున్నాడు. ఐదు నిమిషాల తరువాత బ్రిగేడియర్ ధీరజ్ పాండే లైన్‌లోకి వచ్చేడు.

రాజారెడ్డి ఇక్కడ జరిగిన సంఘటన గురించి చెప్ప గానే "మైగాడ్! ఒక్క రాత్రిలో ఇన్ని హత్యలా? మీకింకా హంతకుల ఆచూకీ ఏమీ దొరకలేదా?" అన్నాడు దిగ్భ్రాంతితో.

"ఇప్పటివరకూ తెలియలేదు. కాని, శవాలు చిన్న క్లూ ఇచ్చాయి. దాని ఆధారంతో ఓ పథకం అల్లేను. బహుశా రెండు రోజులదాకా నేను క్యాంప్‌కు రాకపోవచ్చు. రేపంతా పరిశోధనలో నే గడిచిపోవచ్చు. దయచేసి మీరు రేపు రాత్రి ఎనిమిది గంటలకి, మౌంట్‌రోడ్లో ఉన్న స్కైలైన్ హోటల్ బార్ రూంలో నాకోసం వెయిట్ జెయ్యండి. అక్కడ మీకు కొన్ని వివరాలు చెప్పగలను," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అలాగే" అన్నాడు బ్రిగేడియర్.

7

రాత్రి సరిగ్గా ఎనిమిది గంటలకి స్కైలైన్ హోటల్ బార్ రూంలో అడుగు పెట్టేడు బ్రిగేడియర్ ఫరజ్ సాండే. అతనిప్పుడు మిలిటరీ యూనిఫారంలో లేడు. బ్రౌన్ సూటు వేసుకున్నాడు.

బార్ జనంతో కిటకిట లాడుతోంది. ఇన్స్పెక్టర్ రాజారెడ్డి కనిపిస్తాడేమోనని చుట్టూ కలయజూసేడు. అతనింకా రాలేదు. రిస్టువాచీ చూసుకుంటూ ఓ ఖాళీ టేబిల్ వైపు నడిచేడు బ్రిగేడియర్. బేరర్ రాగానే టూ పెగ్స్ జిన్ తెప్పించమని రాజారెడ్డి కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

పదిహేను నిమిషాల తరవాత ఓ యువతి బార్ రూంలో ప్రవేశించింది. ఆమెని చూడగానే అక్కడ వున్నవాళ్ళందరి కళ్ళు తళతళ మన్నాయి.

ఇరవై ఎనిమిదేళ్ళుంటాయి ఆమెకి. గులాబి రంగు ఒళ్ళు. భుజాలవరకూ కత్తిరించుకున్న జుత్తు. లిప్ స్టిక్ తో ఎరుపెక్కిన పెదాలు. తాగకున్నా తాగినట్టు మత్తుగా చూసే కళ్ళు. బొడ్డు కనిపించేలా కట్టుకున్న ఎర్రని జార్జెట్ చీర. అదే రంగు స్లీవ్లెస్ బ్లౌజు.

చూడగానే మగాడి నరాలు జివజివలాడేలా బొడ్డు ఊపుకుంటూ బార్ కౌంటర్ వైపు నడిచింది. గ్లాసులో రెండు మూడు పెగ్ లు విస్కీ పోయించుకుని ఖాళీ టేబిల్ వైపు వెళుతూ ఓమారు అందర్నీ పరికించింది.

బ్రిగేడియర్ మీద దృష్టి పడగానే ఆమె కళ్ళకి ప్రేమలు పడ్డాయి. కనుబొమలు ముడిచి ఔనా, కాదా అన్నట్టు అతన్ని సమీపించింది. "ఎక్స్క్యూజ్ మి! నా

జ్ఞాపకశక్తి సరైనదైతే మీ పేరు ధీరజ్ పాండే కదూ?"
అంది గుర్తుపట్టటానికి ప్రయత్నిస్తూ.

అతను తలూపి- "ఔను! మీరెవరు?" అన్నాడు మర్యాదగా.

ఆమె విరగబడి నవ్వి- "మీ మగాళ్ళ జ్ఞాపకశక్తి ఇంత పల్చగా వుంటుందని ఇప్పుడే తెలిసింది మైడియర్ పాండే! నీ మొహం ఇంతగా మారిపోయినా, నేను గుర్తుపట్ట గలిగేను. పదేళ్ళ క్రిందటి నీ గర్ల్ ఫ్రెండ్ మృణాళిన్ని మర్చిపోయేవా?" అంది.

"గర్ల్ ఫ్రెండ్!?" బ్రిగేడియర్ కనుబొమలు ముడి పడ్డాయి. ఎంత ప్రయత్నించినా ఆమెను ఎక్కడ చూసేడో జ్ఞాపకం రావడం లేదు. అతని వాలకం చూసి ఆమె గట్టిగా నిట్టూర్చింది.

"నీవు నిజంగా నన్ను మరిచినట్టున్నావ్. మీ మగజాతే ఇంత. పదేళ్ళ క్రితం మనం లక్నోలో ఓ కాక్ టేల్ పార్టీలో కలుసుకున్నాం గుర్తుందా? అప్పుడు నువ్వు కర్నల్ హోదాలో ఉండేవాడివి.

బహుశా నీకు ఈ విషయంకూడా గుర్తు లేదేమో! ఒకసారి మూడు రోజులు సెలవు పెట్టి నన్ను సిమ్లా షికారుకి తీసికెళ్ళావ్!"

బ్రిగేడియర్ మొహం క్షణంలో వికసించింది. "ఓ, హాలో మృణా! అయామ్ వెరీ సారీ! ఇప్పుడంతా జ్ఞాపకం వచ్చింది. పాక్ యుద్ధంలో నేను తీవ్రంగా గాయపడ్డాను. అప్పటినుంచి నా జ్ఞాపక శక్తి సన్నగిల్లింది. యుద్ధంలో గాయపడటంవల్ల ఇప్పుడు నాకు వెనుకటి అందంకూడా లేదు. ఆడవాళ్ళు నన్ను చూడగానే ఆమడదూరం పారి

పోతారు'' అన్నాడు విచారంగా.

మృణాళిని అతనికెదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ అతని చేతిమీద చెయ్యి వేసింది. "బాధపడకు డార్లింగ్! నా కళ్ళకి మాత్రం నువ్వప్పుడెలా ఉన్నావో ఇప్పుడూ అలాగే ఉన్నావ్. సిమ్లాలో నీతో గడిపిన ఆ మూడు రాత్రులు నేనింతవరకూ మర్చిపోలేదు. అందుకే ఇంత త్వరగా నిన్ను గుర్తుపట్టగలిగేను. నీ భార్యా పిల్లలు ఎలా ఉన్నారు? కులాసాయేనా?''

బ్రిగేడియర్ కళ్ళల్లో కాంతి ఆరిపోయింది. "ఆమె నాకు డైవోర్స్ ఇచ్చి పిల్లలతో సహా వెళ్ళిపోయింది. ఇంతకీ నువ్వి మద్రాసులో ఏం చేస్తున్నావ్? ఒంటరిగా వచ్చేవా?'' అడిగాడు ఆశ్చర్యంగా.

ఆమె నవ్వి- "ఏడేళ్ళ క్రితం నేను ఓ నవాబును పెళ్ళి జేసుకున్నాను. ఇప్పుడతను లోకంలో లేడు. అతని ఆస్తంతా నాకు దక్కింది. దాన్ని ఎలా ఖర్చు పెట్టాలో తెలియక, దేశాటన జేస్తూ ఇటువంటి హోటళ్ళలో కులాసాగా కాలం వెళ్ళబుచ్చుతున్నాను'' అంది.

బ్రిగేడియర్ ఇంకా ఏదో అడగబోయేడు. అప్పుడే ఓ బేరర్ వచ్చి- "బ్రిగేడియర్ ధీరజ్ పాండే మీరే కదూ?'' అన్నాడు.

బ్రిగేడియర్ తలూపేడు.

"మీకు ఫోన్ కాల్ వచ్చింది సార్.''

మృణాళినిని కాసేపు కూర్చోమని చెప్పి లేచాడు ధీరజ్ పాండే. బార్ కౌంటర్లో ఉన్న ఫోన్ రిసీవ్ జేసుకున్నాడు.

"అయామ్ వెరీ సారీ సార్! పరిస్థితులు తారుమారైన

దృష్ట్యా చెప్పిన టైంకి రాలేకపోయేను. ప్రస్తుతం నేను శత్రువులకి సంబంధించిన ఓ ముఖ్యమైన వ్యక్తిని వెంబడిస్తున్నాను. నాకు పూర్తి విశ్వాసం ఉంది. అతని ద్వారా వాళ్ళ స్థావరం ఎక్కడో తెలిసిపోతుందని!" అన్నాడు ఇన్స్పెక్టర్ రాజారెడ్డి అవతలినుంచి.

"వెరీ గుడ్! ఇప్పుడు మీరెక్కణ్నుంచి మాట్లాడుతున్నారు? మీకు సహాయంగా ఇంకెవ్వరైనా పంపమంటారా?" అడిగేడు బ్రిగేడియర్ ఆత్రుతగా.

"నో సర్! ఆ వ్యక్తి ఇప్పుడే ఓ బార్లోకి ప్రవేశించేడు. దానికెదురుగా ఉన్న ఓ రెస్టారెంట్లోంచి మాట్లాడుతున్నాను. అతన్ని వెంబడిస్తూ ఏ క్షణంలో ఎక్కడుంటానో నాకే తెలీదు... అదుగో! అతను బార్లోంచి బైటికి వస్తున్నాడు... ఇక ఉంటాను" అవతల క్లిక్మంది.

రిసీవర్ దించి మృణాళిని దగ్గరికెళ్ళేడు బ్రిగేడియర్. "ఇప్పుడు నేను ఫ్రీ అయ్యేను. ఎన్నో ఏళ్ళ తరవాత మళ్ళీ కలుసుకున్నాం. ఈ రాత్రి నా ఆతిథ్యం స్వీకరించడానికి నీకేమైనా అభ్యంతరమా?" అడిగేడు.

మృణాళిని పకపక నవ్వి – "నో! అదేం లేదు. నీ ఆతిథ్యం తప్పక స్వీకరిస్తాను. పద!" అంటూ లేచింది.

బ్రిగేడియర్ బిల్ పేచేసి, ఆమె వెంట బైటికి నడిచేడు.

8

వీధిలో జన సంచారం లేదు.

మసక చీకట్లో అటూ ఇటూ చూసుకుంటూ ఆ మేడని

సమీపించేడు ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి. అతని వెనకే పిల్లిలా అడుగులు వేస్తూ అనుసరిస్తున్నాడు డేవిడ్.

రెండంతస్తుల చిన్నసైజు మేడ అది. మేడ చుట్టూ కాంపౌండ్ వాల్ కట్టబడి వుంది. మెయిన్ గేటు పక్కనే పెద్ద సైన్‌బోర్డ్ ఉంది.

'సిలోన్ టూరిస్ట్ గైడ్ సెంటర్ అండ్ ట్రావెలింగ్ ఏజెన్సీ.'

సాలోచనగా తలూపుతూ జేబులోంచి సైలెన్సర్ బిగించిన పిస్తోలు తీసేడు రాజారెడ్డి. తన వెనక రమ్మన్నట్టు డేవిడ్‌కు సైగజేసి, మూసివున్న గేట్‌వైపు నడిచేడు. గేటు తెరచుకుని ఇద్దరూ కాంపౌండ్‌లోకెళ్ళేరు.

సింహద్వారం మూసివుంది. ద్వారాన్ని సమీపించగానే ఇన్‌స్పెక్టర్ పక్కకి తప్పుకుని చీకట్లో నక్కి నిల్చున్నాడు.

డేవిడ్ గడపకున్న కాలింగ్ బజర్ నొక్కి రెడీగా నిల్చున్నాడు. ఐదు నిమిషాల తరవాత ఎవ్వరో తలుపు దగ్గరికి వస్తున్న బూట్సుల సవ్వడి వినిపించింది.

"ఎవ్వరు?" లోపలినుంచి వినిపించింది మగ కంఠం.

"టెలిగ్రాం సర్!" అన్నాడు జేబులోంచి మడత పెట్టిన కాగితం తీస్తూ.

గడియ తీస్తున్న శబ్దం. తలుపు తెరుచుకుంది!

ఓ వ్యక్తి ఇవతలకి వచ్చి- "ఏదీ టెలిగ్రాం?" అంటూ చెయ్యి చాపేడు.

అతను ఇవతలికి రావడం, అంతవరకూ చీకట్లో నక్కి వున్న రాజారెడ్డి పిస్తోలు పిడితో మెరుపులా అతని బుర్ర మీద దెబ్బ తియ్యడం రెప్పపాటులో జరిగిపోయేయి. ఆ వ్యక్తి కిక్కురుమనకుండా అక్కడే కూలేడు. అతన్ని

పక్కకి ఈడ్చి ఇద్దరూ లోన అడుగుపెట్టేరు. ఇప్పుడు ఇద్దరి చేతుల్లోనూ రివాల్వర్స్ రెడీగా ఉన్నాయి.

అది హాలు! అక్కడ ఎవ్వరూ లేరు. ఓ గోడవారగా పైకి మెట్లున్నాయి. పైనుంచి ఎవ్వరో ఎవర్నో హింసలు పెడుతున్నట్టు మూలుగులూ, చిన్నచిన్న కేకలూ విని పిస్తున్నాయి.

ఇద్దరూ నిశ్శబ్దంగా మెట్లెక్కి పైకి జేరుకున్నారు. పైన మూడుగదులున్నాయి. మధ్య గదిలోంచి వినిపిస్తు న్నాయి మాటలూ, మూలుగులూ. తలుపు సగంవరకూ మూసివుంది. లోపల లైటు వెలుగుతోంది.

ఆ సందులోంచి లోనికి చూసిన డేవిడ్ దిగ్భ్రాంతితో నివ్వెరబోయేడు.

గది మధ్య కుర్చీలో ఓ స్త్రీ కట్టేయబడుంది. ఆమె కిరుపక్కలా ఇద్దరు వ్యక్తులు, చేతుల్లో హంటర్స్ పట్టుకు నిల్చున్నారు.

మరోవ్యక్తి ఆమెముందు నిల్చుని ఏదో అంటున్నాడు.

అతను ధీరజ్ పాండే!

బ్రిగేడియర్ ధీరజ్ పాండే!!

ఆ యువతి ఎవ్వరో కాదు.

అనేక కేసుల్లో తమతో కలిసి పనిజేసిన లేడీ ఇన్వెస్టి గేటర్ షీలా!

డేవిడ్ ఇంకా ఆ దిగ్భ్రాంతినించి తేరుకోకముందే, అప్పటివరకూ ప్రైవేటు వీధిలో పొంచివుండి ఎదురు చూస్తున్న జనరల్ కైలాశ్ సైగల్, ఐ. జి. పి. ఇద్దరూ నిశ్శబ్దంగా అక్కడికి జేరుకున్నారు.

లోపల బ్రిగేడియర్ కంఠం మారుమోగింది. "ఇప్పు

డైనా నిజం చెప్పు. ఎవరు నువ్వు? నోరు తెరిపించడానికి మా దగ్గర అనేక పద్ధతులున్నాయ్. నీవు భరించలేవు. ఆ దుర్దశ రాకముందే బుద్ధిగా చెప్పెయ్."

"ఎన్నిసార్లని చెప్పను? నేను మృణాళిని!"

పక పక నవ్వి– "ఇంకా నీకు జ్ఞాపకశక్తి రాలేదన్న మాట. అన్వర్! ఏదీ మన ఫార్ములా నెంబర్ టూ శాస్త్ర వుపయోగించి చూడు. అప్పుడైనా ఈమెగారికి జ్ఞాపకం వస్తుందేమో తనెవరో?" అన్నాడు బ్రిగేడియర్.

షీల పక్కన నిల్చున్న ఇద్దర్లో ఒకడు, జేబులోంచి మడత కత్తి బైటికి తీసేడు.

ఇక చూస్తూ నిల్చుని లాభంలేదు. పిస్తోలు సిద్ధంగా పట్టుకుని గదిలో అడుగు పెట్టి– "గుడీవ్నింగ్ సర్! మీరింత రిస్కు తీసుకోనవసరంలేదు. ఆమె ఎవరో నేను చెబుతాను." అన్నాడు ఇన్స్పెక్టర్ రాజారెడ్డి వినయంగా.

బ్రిగేడియర్ అదిరిపడి వెనుదిరిగి– "నువ్వా?" అన్నాడు గుడ్లు తేలవేసి.

"ఔను సార్. నేనే! బహుశా, నావల్ల మీకేదైనా సహాయం అవసరమౌతుందేమోనని ఇలా వచ్చేను."

బ్రిగేడియర్ నవ్వలేక నవ్వి– "బార్లో ఈమె మీద నాకు అనుమానం వేసింది. అందుకే ఇక్కడికి తీసుకువచ్చి దర్యాప్తు జేస్తున్నాను" అన్నాడు.

"అలాగా దర్యాప్తు జెయ్యదలచుకున్నవారు ముక్కూ మొహం తెలియని ఈ భవనంలోకి ఎందుకు తెచ్చేరు? పోలీస్ హెడ్క్వార్టర్స్కి తీసికెళ్ళవచ్చుగా? మీరు అనవసరంగా శ్రమపడ్డారు సార్! ఈమె పేరు షీలా. మా డిపార్ట్మెంట్లో కొమ్ములు తిరిగిన లేడీ ఇన్వెస్టిగేటర్!"

"లేడీ ఇన్వెస్టిగేటరా?" బ్రిగేడియర్ కంఠం వణికింది.

"ఔను సార్! నేనే ఈమెని మృణాళిని పేరుతో మీ దగ్గరికి పంపేను."

రాజారెడ్డి కంఠం మారిపోయింది. "మిస్టర్ ధరజ్ పాండే! ఇంతవరకూ నీ నాటకం నిరాటంకంగా సాగింది. కానీ, నీవు చేసిన చిన్న పొరపాటువల్లే నీ బండారం బద్దలు కొట్టింది. ఒక్కొక్కసారి శవాలే కథలు చెబుతుంటాయి. నీవు చంపిన శవాలే నీ గురించి 'క్లూ'లు ఇచ్చాయి.

ముఖ్యంగా నిన్న రాత్రి గోల్డ్ స్టార్ హోటల్లో నన్ను చంపడానికి ఆ వ్యక్తిని పంపి చాలా పెద్ద పొరపాటు చేశావ్.

పల్లవి ఇంటినించి నేను గోల్డ్ స్టార్ హోటల్ కెళ్తున్నానని నీకు తప్ప మరో ప్రాణికి తెలీదు. అలాగే, సి. బి. ఐ. కోడ్ సిగ్నల్ ఇతర్లకి తెలియడం అసంభవం! అటువంటిది అతనికెలా తెలిసేయి? అలాగే మేము రంగంలోకి దిగింది ఎవరెవరిపై నిఘా వేసింది నీకు, జనరల్ గారికే తెలుసు. అటువంటిది మేము రంగంలోకి దిగీదిగగానే ఒక్క రాత్రిలో ఆరు హత్యలు జరిగాయి.

అప్పుడే నా అనుమానం నీమీదికి మళ్ళింది. నా సందేహాలు నివృత్తి చేసుకోవడానికి నిన్ను స్కైలైన్ హోటల్ కి రమ్మని చెప్పి, లేడీ ఇన్వెస్టిగేటర్ షీలను మృణాళిని పేరుతో నీ దగ్గరకి పంపి మేమంతా హోటల్ బైట నీకోసం కాచుకున్నాం.

షీలను వెంటపెట్టుకుని నీవు హోటల్లోంచి బైటికివచ్చి కార్లో బైలుదేరావ్. మీ వెనకే మేమూ ఫాలో అయ్యాం.

నీ కారు ఈ మేడలోకి తిరిగింది. ఆ విధంగా మాకు మీ స్థావరం తెలిసిపోయింది..." ఇన్స్పెక్టర్ ఇంకా ఏదో అంటూనే వున్నాడు.

హఠాత్తుగా బ్రిగేడియర్లోనూ, అతని అనుచరుల్లోనూ చలనం వచ్చింది. వాళ్ళింకా తెగించకముందే, బైట నిల్చున్న జనరల్ సైగల్, ఐ. జి. పి. డేవిడ్, మెరుపులా లోనికి దూరి ముగ్గుర్నీ చుట్టుముట్టేరు.

ధీరజ్ పాండే మొహంలో నెత్తురుచుక్క లేదు.

రాజారెడ్డి నవ్వి– "ఇక లాభంలేదు. ఎంత తెగించినా నిష్ప్రయోజనం. నువ్వసలు బ్రిగేడియర్ ధీరజ్ పాండే కావని నా అనుమానం!

భారత సైన్యంలో, తన మాతృభూమికి ద్రోహం తలపెట్టేంతటి నీచుడెవ్వడూ లేడు. బ్రిగేడియర్ ధీరజ్ పాండేను ఎక్కడో మట్టుపెట్టి, ప్లాస్టిక్ సర్జరీద్వారా ఆయనలా నటిస్తూ, ఫ్యాక్టరీలో అత్మప్రకాశ్, నిరంజన్ దాస్లను లోపరచుకుని డిఫెన్స్ సీక్రెట్స్, నీ దేశానికి పంపుతున్నావ్. నువ్వు పాకిస్తాన్ గూఢచారివి! అవునా!" అన్నాడు.

డేవిడ్ ముందుకువచ్చి అతని దవడలకింద చేతులు వేసి బలంగా లాగాడు.

అతని ముఖంమీది మాస్క్ తొలిగిపోయింది. ఇప్పుడు ఆ గదిలో బ్రిగేడియర్ పాండే లేడు. అతని స్థానంలో ఎవ్వరో కొత్త వ్యక్తి వున్నాడు.

మిషన్ విజయవంతంగా ముగిసింది.

—: ఐపోయింది :—